సాక్షి
వికారాబాద్
మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



తూములతో పరేషాన్!

దుద్యాల్ మండలంలోని పలు చెరువులు, కుంటల తూములు మరమ్మతులకు నోచుకోవడం లేదు. 10లో ▸



నిబంధనలు తప్పనిసరి

టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వారు నిబంధనలు పాటించాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు. 10లో ▸



దూది రైతుకు దుఃఖం

పత్తి పంట కోతకొచ్చిన సమయంలో కూలీలు దొరక్క రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్: పట్టణంలో రోడ్లు భవనాల శాఖ అతిథి గృహ నిర్మాణానికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి భూమిపూజ చేశారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో రూ.6.80 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరితగతిన పనులు ప్రారంభించాలని, నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, కౌన్సిలర్ శంకర్ నాయక్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన



లింగ్యా నాయక్

అనంతగిరి: పోలింగ్ కేంద్రాల వారీగా మంగళవారం ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో సంబంధిత అధికారులకు సూచించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 1,133 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలతో పాటు నారాయణపేట జిల్లాలోని నాలుగు మండలాలు, మహబూబ్ నగర్ జిల్లాలోని గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లోని పోలింగ్ బూత్‌లలోని నోటీసు బోర్డుల్లో జాబితాను అతికించాలని సూచించారు. అలాగే 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు.

తాండూరు వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న శివకుమార్

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త శివకుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ వ్యవస్థాపకులు నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో బహుజనుల గొంతుకై నిలిచి, వివక్ష ధోరణిపై గొంతెత్తి, సామాజిక కార్యక్రమాలను నిర్వహించే బహుజన మేధావులకు ఏటా ఈ అవార్డును అందజేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శివకుమార్‌కు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగిందన్నారు. సామాజిక రుగ్మతలను పారదోలుతూ బహుజనుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని తెలిపారు.

మొసలి కలకలం

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట చెరువులో మొసలి కలకలం రేపుతోంది. చెరువు కట్టపై నుంచి వెళ్తున్న రైతులకు మొసలి కనిపించింది. వారి రాకను గుర్తించిన మొసలి నీటిలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. చెరువు వద్దకు ఎవరూ వెళ్లరాదని, పశువులను కూడా తీసుకెళ్లరాదని అధికారులు సూచించారు. నెల రోజుల క్రితం దేశాయిపల్లి చెరువులో మొసలిని గుర్తించారు. ఇప్పుడు బాలంపేట చెరువులో మొసలి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

విధి నిర్వహణలో ప్రజలతో మమేకమవ్వాలి

రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

శంకర్‌పల్లి: ప్రతి ఉద్యోగి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే ప్రజలతో మమేకమవ్వాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలో సోమవారం నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దామోదర్ దంపతులకు గజమాల, శాలువా కప్పి ఘనంగా స న్మానించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లా డుతూ.. 27 ఏళ్ల వైద్య రంగంలో దామోదర్ ఎన్నో ఎత్తుపల్లాలు చూసారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు తాపత్రేయపడేవారన్నారు. ప్రతి ఒక్కరూ ఆ విధంగా తమ ఉద్యో గ జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, చేవెళ్ల డివిజన్ లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కదలని డొంక



ఇటీవల పరిగి పోలీసులు స్వాధీనం చేసుకున్న బోర్‌వెల్ వాహనం

కొలిక్కిరాని బోరుబండ్ల అక్రమ రవాణా కేసు

- పోలీస్, ఆర్టీఏ శాఖల మధ్య సమన్వయ లోపం
- పట్టుబడిన రెండు వాహనాల విలువ రూ.4 కోట్లపైనే..
- పరిగి మీదుగా ముంబై పోర్టుకు..
- అక్కడి నుంచి ఆఫ్రికా దేశాలకు తరలింపు
- జిల్లా సరిహద్దు దాటించేందుకు ఓ నేతకు భారీగా ముడుపులు?

వికారాబాద్: బోర్‌వెల్ వాహనాల అక్రమ తరలింపు కేసు ఎటూ తేలడంలేదు. పట్టుబడిన వాహనాలు.. కేసు దర్యాప్తు విషయంలో అన్నీ అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. గత సెప్టెంబర్ 28న ఒకటి.. ఆ తర్వాత నాలుగు రోజులకు మరో బోరు బండిని పరిగి పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. డాక్యుమెంట్లు లేకుండా రాత్రి వేళ గుట్టుగా తరలిస్తున్న బోర్‌వెల్ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు పట్టుబడి నెల రోజులు కావస్తున్నా కేసులో ఎలాంటి పురోగతి కనిపించడంలేదు. నిగ్గు తేల్చే విషయంలో అటు పోలీసులు.. ఇటు ఆర్టీఏ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కేసు ముందుకు కదలడంలేదు. హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలో తయారు చేసి ఆఫ్రికా దేశాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రతి నెలా పరిగి మీదుగా 45 బోరు బండ్లు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం. వాహనాలకు నంబర్ ప్లేటు లేకుండా అడ్డదారిలో ముంబై పోర్టుకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో పెద్దల హస్తంతోపాటు ఓ మాఫియా పని చేస్తోందనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రతి నెలా పదుల సంఖ్యలో వాహనాలను విదేశాలకు తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి రూ. కోట్లలో గండి పడుతోంది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టుబడిన రెండు వాహనాలు వేర్వేరు ముఠాలు తరలిస్తున్నట్లు తేలింది. దీని బట్టి చూస్తే చాలా మంది ఈ దందాను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

బీఎస్ ఫోర్ వెహికల్స్

రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమ రవాణా చేస్తున్న బోరు బండ్ల వ్యవహారంలో అన్నీ అనుమానాలే వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా భారీ సంఖ్యలో వాహనాలు అక్రమ రవాణా అవుతున్నాయి. పోలీసులు స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలు బీఎస్ ఫోర్ ప్రకారం మ్యాన్‌ఫ్యాక్చర్ చేసినట్లుగా ఆర్టీఏ అధికారులు గుర్తించారు. మన దేశంలో బీఎస్ ఫోర్ వాహనాల తయారీకి ఇప్పటికే స్వస్తి పలకగా ఆఫ్రికా దేశాలు నేటికీ ఈ టెక్నాలజీ వాహనాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మన దేశంలో బీఎస్ సిక్స్ వాహనాలను వినియోగిస్తున్నారు. బీఎస్ ఫోర్ వాహనాలకు ఆర్టీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయరు. ఇదిలా ఉండగా బోరుబండ్ల అక్రమ రవాణాపై పోలీసులు కేసు నమోదు చేస్తే వారికి సహకరిస్తామని, ఫైన్ వేయడానికి గానీ తదుపరి చర్యలు తీసుకోవడానికి గానీ తమకు ఎలాంటి అధికారం లేదని ఆర్టీఏ అధికారులు అంటున్నారు. కేసు నమోదు, విచారణ పోలీసులే చేయాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. అయితే వాహనాలను ఎవరు తయారు చేస్తున్నారు..? అక్రమ రవాణా వెనుక ఉన్నది ఎవరు..? ప్రభుత్వానికి జరుగుతున్న నష్టం ఎంత అనేది పోలీసులు తేల్చాలి. అయితే ఆ శాఖ ఒత్తిడిలకు తలొగ్గి ఆర్టీఏ ద్వారా రూ.10 వేలో రూ.25 వేలో ఫైన్ వేయించి కేసు ముగించేలా కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. బోరు బండ్ల అక్రమ రవాణా కేసును ఇటు ఆర్టీఏ అధికారులు గానీ అటు పోలీసులు గానీ సీరియస్‌గా తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



బోర్‌వెల్ వాహనాలకు అన్ని రికార్డులు సక్రమంగా ఉంటే ఒక్కో వెహికల్ విడి భాగాలకు సంబంధించిన జీఎస్టీ కాకుండా 14 శాతం పన్ను రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. సామర్థ్యాన్ని బట్టి ఒక్కో బోరు బండి రూ. కోటి నుంచి రూ. రెండు కోట్ల వరకు ధర ఉంటుంది. ఈ లెక్కన ప్రతి నెలా ఈ రూట్లో అక్రమంగా తరలిస్తున్న 45 వాహనాలకు దాదాపు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వాహనాల అక్రమ తరలింపు మాఫియాకు పరిగికి చెందిన ఓ ముఖ్య నేత అండదండలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో వాహనాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా జిల్లా సరిహద్దు దాటించినందుకు రూ.లక్ష వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. డీల్ కుదరకపోవడంతోనే తాజాగా వాహనాలు పట్టుబడినట్లు తెలిసింది. బోరుబండ్లను స్వాధీనం చేసుకొని నెలరోజులు కావస్తున్నా అక్రమ రవాణా వెనుక ఎవరు ఉన్నారనే విషయం తేలడం లేదు.



పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు ఇస్తున్న కార్మికులు

సీసీఐలో పీఎఫ్ స్పెషల్ డ్రైవ్

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ గ్రామ శివారులో గల కేంద్ర ప్రభుత్వ రంగసంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీలో పీఎఫ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బాలకృష్ణ, సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలను నివృత్తి చేస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగే స్పెషల్ డ్రైవ్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికుల వేతనంలో పీఎఫ్ కట్ చేస్తున్న సంబంధిత యాజమాన్యం పీఎఫ్ కార్యాలయానికి ఆ మొత్తం జమ చేస్తుందో లేదో పరిశీలించాలన్నారు. కంపెనీలో వివిధ విభాగాల్లో ఉన్న కాంట్రాక్టర్లు క్యాంప్‌నకు రాకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యం, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఉంటేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. 200 మంది కార్మికులు పాల్గొని ఫిర్యాదులు అందజేశారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

యాలాల: రైతులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని అగ్గనూరు మారుతి జిన్నింగ్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తిలో తేమ శాతాన్ని ఎలా పరీక్షిస్తున్నారు? ఎంత ధరకు కొంటున్నారు అనే విషయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నా మిల్లుల యజమానులు దీపావళి తరువాత ఏర్పాటు చేస్తామని పేర్కొనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమ శాతం సరిగ్గా ఉన్నా పత్తి ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు వాపోయారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి, ఏఎంసీ డైరెక్టర్లు రాజు, నర్సింహులుగౌడ్ తదితరులు ఉన్నారు.



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న రజిత

లెక్చరర్‌పై పోక్సో కేసు

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు
- పెద్దేముల్ కళాశాల ఎదుట ప్రజాసంఘాలు, విద్యార్థి నేతల ఆందోళన

పెద్దేముల్: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఫిర్యాదుల నేపథ్యంలో ఓ లెక్చరర్‌పై పోక్సో కేసు నమోదైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జమీల్ కొద్ది రోజులుగా బాలికలతో అసభ్యంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై బాధిత బాలికలు.. ప్రజా సంఘాలు, విద్యార్థి నేతలకు తెలియజేయడంతో సోమవారం పెద్ద సంఖ్యలో వెళ్లి కాలేజీని ముట్టడించారు. సదరు లెక్చరర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, లైంగిక వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కొమ్ము రజిత, జిల్లా నోడల్ ఆఫీసర్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం పలువురు విద్యార్థులు జమీల్‌పై ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

> **కేసు నమోదు చేశాం**
>
> ప్రజా సంఘాలు, యువజన నాయకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధ్యాపకుడు జమీల్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థిని కూడా రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో జమీల్‌పై పోక్సో కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నాం.
>
> – గిరి, ఎస్‌ఐ, పెద్దేముల్

కుల వృత్తులకు ప్రోత్సాహం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం మోమిన్‌పేటలోని నందివాగు ప్రాజెక్టులో అధికారులు, నాయకులతో కలిసి 96వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల వృత్తులను ప్రోత్సహించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. మత్స్యకారులు చేపల పెంపకం ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. జిల్లాలోని అన్ని చెరువుల్లో 13లక్షల 60వేల చేప పిల్లలను వదలనున్నట్లు చెప్పారు. చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంఘాల సభ్యులు చేపల పెంపకం, విక్రయించడం ద్వారా ఉపాధి పొందాలని, అలా కాకుండా కాంట్రాక్టర్లకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వం కుల వృత్తులను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రతి రైతు కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ముదిరాజ్ భవన నిర్మాణం కోసం నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీధర్, జిల్లా మత్స్య శాఖ అధికారి వెంకన్న, ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మల్లారెడ్డి, మహంత్‌స్వామి, వేమారెడ్డి, సిరాజొద్దీన్, ఎజాస్, ఎరాజ్, బాల్‌రెడ్డి, బాబు, మత్స్య సహకార సంఘాల సభ్యు లు రాజు, అంబదాసు తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: నందివాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

రూ.850 కోట్లతో రింగ్‌రోడ్డు

అనంతగిరి: త్వరలో వికారాబాద్ చుట్టూ రూ. 850 కోట్లతో రింగ్‌రోడ్డు రానున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ పట్టణంలో వ్య వసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ.1. 14 కోట్లతో 24 దుకాణాల నిర్మాణానికి సోమ వారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడన్నారు. ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వికారాబాద్ నియోజకవర్గానికి భారీగా నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. వుడా ఏర్పాటుతో జిల్లాలో రూపురేఖలు మారుతాయని తెలిపారు. అంతకుముందు యార్డు లో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాంలు అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆర్డీఓ వాసుచంద్ర, రాష్ట్ర మ త్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు మైపాల్‌రెడ్డి, కిషన్‌నయాక్, సత్యనారాయణ, మార్కెట్ సెక్రటరీ, రైతులు, కూరగాయల వ్యాపారులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి

జిల్లాలో చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. సోమవారం వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి అడగ్గానే సీఎం రూ.110 కోట్లు మంజూరు చేశారని అన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, అడిషనల్ కలెక్టర్ సుధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కిషన్‌నాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయండి

- నూతన సభ్యులకు ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచన
- బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం

చేవెళ్ల: మార్కెట్ అభివృద్ధికి నూతన పాలకవర్గం కృషి చేయాలని, రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నూతన పాలకవర్గం చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పాలకవర్గం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. చేవెళ్ల మార్కెట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సూచించారు. రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని, తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్ పెంటయ్యగౌడ్, రాములు మాట్లాడుతూ.. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటామని చెప్పారు. మార్కెట్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పి.లలిత, యాదిరెడ్డి, మల్లేశ్, బాలయ్య, నరేందర్, హనీఫ్, ఎ.కృష్ణారెడ్డి, టి.జనార్దన్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, సుదర్శన్, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన చైర్మన్ పెంటయ్యగౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న టీపీయూఎస్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

చేవెళ్ల: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్ అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం అన్ని మండలకేంద్రాల్లోని తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్యకు టీపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురధీర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని, పీఆర్‌సీని ప్రకటించి అమలు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

క్లుప్తంగా

నేడు అగ్గనూరుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండల పరిధిలోని అగ్గనూరు శివారులోని మారుతి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేయనున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం రానున్నట్లు తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సీసీఐ అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులతో కలిసి కేంద్రాన్ని ప్రారంభిస్తారని వివరించారు. ప్రభుత్వ మద్దతు ధర కల్పిస్తూ ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బాల్‌రెడ్డి కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాండూరు టౌన్: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని అంతారంలో గ్రామానికి చెందిన ఆరుగురు ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 10,090 లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. సోమవారం మంత్రి పొంగులేటి నివాసానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌లు వెళ్లి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తాండూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

సాధన సంస్థకు అభినందన



కమిషనర్ సీవీ ఆనంద్‌కు బ్రోచర్‌ను అందజేస్తున్న సంస్థ రాహుల్

ధారూరు: సాధన స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కార్యక్రమాలను సోమవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి సంస్థ నిర్వాహకుడు రాహుల్ వివరించారు. బాల్య వివాహాల అడ్డుకట్ట, యాచకుల సమస్యలు, పిల్లల అక్రమ రవాణా, చిన్నారులపై లైంగిక వేధింపుల నిరోధకంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఆయన వివరించారు. ఆడపిల్లల మేలు కోసం సాధన సంస్థ చేస్తున్న కృషిని కమిషనర్ అభినందించారు. అనంతరం సంస్థ బ్రోచర్‌ను కొత్వాల్‌కు అందజేశారు.

గ్రామాన్ని మున్సిపల్‌లో కలపొద్దు



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నస్కల్ గ్రామస్తులు

పరిగి: తమ గ్రామాన్ని మున్సిపల్‌లో కలపొద్దని సోమవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు మండలంలోని నస్కల్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామాన్ని మున్సిపల్‌లో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. మున్సిపల్‌లో కలిపిన కొన్ని గ్రామాలు చాలా దీన పరిస్థితిలో ఉన్నాయన్నారు. గ్రామస్తులు మొత్తం మున్సిపాలిటీలో విలీనాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. అధికారులు గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తూములతో పరేషాన్!



తూము నుంచి వృథాగా పోతున్న అలేడ్ చెరువు నీరు



అలేడ్ చెరువు తూము వద్ద తగ్గిన నీటి మట్టం



ఖాళీ అయిన నాన్యనాయక్ తండా కుంట

- చెరువులు, కుంటల్లో వృథాగా పోతున్న సాగు నీరు
- నీటి నిల్వలకు యాసంగిలో ఇక్కట్లు
- మరమ్మతులు చేపట్టాలని రైతుల డిమాండ్

దుద్యాల్: వానలతో నిండుకున్న నీటి వనరులను కాపాడుకోవడం యాసంగి సాగులో ముఖ్యం. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు నిండుకోవడంతో రైతన్నలు కొంత సంబర పడ్డారు. కానీ తూములు పాడవ్వడంతో సాగు నీరు వృథాగా పోతుంది. యాసంగిలో వరి సాగు చేసుకునేందుకు కుంటలు, చెరువుల్లో ఉన్న నీరే ఆధారం. వర్షా కాలంలో సరైన సమయంలో వానలు కురువకపోవడంతో చాలా మంది అన్నదాతలు వరి సాగుకు వెనుకడుగు వేశారు. సీజన్ చివర్లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరాయి. దీంతో నిండు కుండల్లా తటాకాలు మారాయి. వాటిలో కొన్ని అలుగు సైతం పారాయి. చెరువులు, కుంటల్లో నిండు కుండలా ఉన్న నీటిని చూసి రైతన్న యాసంగిలో సాగు చేసే వరిపై ఆశ పెంచుకున్నారు. ప్రస్తుతం కుంటలు, చెరువుల్లో నీటిని వృథా కాకుండా నిల్వ ఉంచుకుంటేనే వేసవిలో పంటకు ఉపయోగపడుతాయి.

కోత సమయంలో తిప్పలు

మండల పరిధిలోని ఇటీవల అలేడ్ చెరువు తూముకు రంధ్రం ఏర్పడడంతో నిల్వ ఉన్న నీరు దాదాపు 24 గంటల పాటు బయటకు వృథాగా పోవడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. చెరువు కింద సాగు చేసిన వర్షాకాలం పంటలు పూర్తి స్థాయిలో కోతలకు వచ్చాయి. చెరువు నుంచి వృథాగా పోతున్న నీటితో పంట కోయడానికి సిద్ధంగా భూములు బురదమయంగా మారాయి. అలేడ్ చెరువు కింద దాదాపు 100 ఎకరాల వరకు ఆయకట్టు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. చెరువులో నీరు నిండుగా నిల్వ ఉంటే యాసంగి వరి సాగుకు ఉపయుక్తంగా ఉంటుంది. మిగతా పంట కాలం వరకు హస్నాబాద్ పెద్ద చెరువు నుంచి నీటిని తీసుకోస్తామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఇటీవల మండల పరిధిలోని నాన్యా నాయక్ తండాకు చెందిన కుంట సైతం తూముకు పెద్ద రంధ్రం ఏర్పడడంతో నీరు మొత్తం వృథాగా పోయింది. ఇలాంటి జరగకుండా ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలను జాగ్రత్తగా చూసుకోవాలని రైతన్నలకు అధికారులు సూచనలు అందిస్తున్నారు.

తాత్కాలిక మరమ్మతు

అలేడ్ చెరువు తూము మూసే ఇనుప రాడ్డు పూర్తిగా కిందికి పడిపోతుండడంతో నీరంతా వృథాగా పోతుందని స్థానిక రైతులు వాపోతున్నారు. దీంతో తాత్కాలికంగా మట్టితో పూడ్చామని పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్ తెలిపారు. చెరువు నిండిన నాటి నుంచి ఏకంగా మూడుసార్లు ఇలా నీరు తూము నుంచి బయటకు వృథాగా పోయిందని అన్నదాతలు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చొరవ చూపి తూమును పలు సందర్భాలలో తాత్కాలిక మరమ్మతు చేసి నీటిని కిందకు పోకుండా నిలువనిస్తున్నారు. అధికారులు స్పందించి తూముకు శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం



పోలీసు విధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పరిగి: విద్యార్థులు పోలీసు విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పోలీసు విధులు తదితర విషయాలపై అవగాహన కల్పించి వ్యాసరచన పోటీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పోలీసు ఉద్యోగం ఎంతో ఉత్తమమైందన్నారు. నిత్యం ప్రజలకు అన్ని రకాలుగా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న వారు పోలీసులు ఒక్కరే అని గుర్తు చేశారు. ప్రస్తుతంలో సైబర్ నేరాలతో ఎంతో మంది అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కావున విద్యార్థులు తమ ఇళ్లల్లో సైబర్ నేరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్

కొడంగల్ రూరల్: పెండింగ్ స్కాలర్‌షిప్‌తో పాటుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పెండింగ్‌లో పెట్టిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ సభ్యులు నగేష్, మల్లేశ్వరీ, భాను, విజయ్ పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు

నిబంధనలు తప్పనిసరి



తాండూరు టౌన్: అగ్ని ప్రమాద నివారణపై ప్రదర్శన ఇస్తున్న ఫైర్ సిబ్బంది

- అగ్నిమాపక శాఖ ఎస్ఐ ధనుంజయ స్వామి

అనంతగిరి: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అగ్నిమాపక శాఖ ఎస్ఐ ధనుంజయ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వాహనాలు రద్దీగా లేకుండా చూడాలన్నారు. మైదానానికి ఉన్న రెండో గేట్‌ను సైతం తెరిచి ఉంచాలన్నారు. దుకాణాల మధ్య గ్యాప్ ఉండాలన్నారు. ఎవరు కూడా ఈ ప్రాంత ఆవరణలో టపాసులు పేల్చవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

తాండూరు టౌన్: తాండూరు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం దుకాణంలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం సంభవిస్తే నివారణ చర్యలపై అవగాహన, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని మాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి జలంధర్ మాట్లాడుతూ.. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ బాణసంచా దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగి తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో పట్టణంలోని దుకాణాలను తనిఖీ చేశామన్నారు. పట్టణంలో కేవలం 13 దుకాణాలకు మాత్రమే టపాసుల విక్రయానికి అనుమతి ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తప్పకుండా దుకాణంలో అగ్ని నియంత్రణ పరికరాలు, ఇసుక, నీటి బకెట్‌లను అందుబాటులో పెట్టుకోవాలని సూచించినట్లు తెలిపారు.

యథేచ్ఛగా తవ్వకాలు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

యాలాల: ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపట్టినా పట్టించుకునేవారే కరువయ్యారు. మండల పరిధిలోని కమాల్‌పూర్ పరిధిలోని తల్లారి కుచ్చ సమీపంలోని రెండు రోజులుగా ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ భూమిలో మట్టిని తవ్వి తరలిస్తున్నాడు. ఈ కాంట్రాక్టర్ కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులను చేపడుతున్నాడు. ఇదే అదునుగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో కొందరు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఘటనా స్థలికి వచ్చిన ఆర్ఐ పరిశీలించి ఎటువంటి చర్యలు తీసుకోకుండానే వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ అంజయ్యను వివరణ కోరగా మట్టి తరలింపునకు కాంట్రాక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడని.. ఇంకా అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



కమాల్‌పూర్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన తవ్వకాలు

అనారోగ్యంతో కూలీ మృతి

తాండూరు టౌన్: లారీ అన్‌లోడింగ్ కోసం వెళ్లిన ఓ కూలీ అనారోగ్యంతో మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన జంపని నర్సిములు అలియాస్ రాజు(40) మెదక్ జిల్లా నర్సాపూర్‌కు లారీ అన్‌లోడింగ్ చేసేందుకు వెళ్లాడు. అయితే మార్గమధ్యలోనే ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అక్కడి నుంచి తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ దాడులు

అనంతగిరి: జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలో దాడులు చేశారు. మద్గుల్ చిట్టంపల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21,570 నగదు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని సూర్యప్రకాష్ కాలనీలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. 7.8 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీపీయూఎస్ రాష్ట్ర కోశాధికారి పురుషోత్తంరావు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీపీయూఎస్ నాయకులు

యాలాల: ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ రాష్ట్ర కోశాధికారి కరణం పురుషోత్తం రావు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండల శాఖ ఆధ్వర్యంలో యాలాల తహసీల్దార్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒకే డీఏను ప్రకటించిందన్నారు. న్యాయంగా రావాల్సిన డీఏలపై ఉద్యోగులు ఉద్యమాలు చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. పీఆర్సీ నివేదిక ప్రకారం రెండో పీఆర్సీని 50శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, సరెండర్ లీవ్‌లు, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, జిల్లా బాధ్యులు గాజుల బస్వరాజ్, చంద్రశేఖర్, శేఖర్, నరహరిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



దోమ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నేతలు

- తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబహదూర్

దోమ: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బహదూర్ డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధ్యాయుల ధర్మాగ్రహ దీక్ష నేపథ్యంలో ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీలను విడుదల చేయాలంటూ తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్‌సీ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం మూడు డీఏలను పెండింగ్‌లో ఉంచగా, ఈ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్న రెండు డీఏలను పెండింగ్‌లో పెట్టిందన్నారు. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా బాధ్యులు గోపాల్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, రాజు, నవీన్, పృథ్వీ, రాజశేఖర్, బాలకృష్ణ, మండల బాధ్యులు సతీష్, ప్రవీణ్, నాగరాజ్, వినోద్, వెంకటేశ్, సాయికుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలంటూ తపస్ నాయకులు పెద్దేముల్ తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, సంతోష్, వడిచెర్ల సత్యం, వెంకటయ్య, పట్లోళ్ల అనిల్, శంకర్, యాదగిరి, వెంకటేష్, కవిత, జయశ్రీ పాల్గొన్నారు.



పరిగి: తహసీల్దార్ కార్యాయలం ఎదుట తపస్ నాయకులు

5న కలెక్టరేట్ ముట్టడి

పరిగి: పెండింగ్ డీఏలు, పీఆర్‌సీలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పలు రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో ఉద్యోగులు చాలా అవస్థలు పడుతున్నారని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే నవంబర్ 5న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు మధుసుదన్ రావు, ప్రధాన కార్యదర్శి సాయిబాబ, జిల్లా బాధ్యులు లక్ష్మణ్, చంద్రమౌళి, శ్రీశైలం, బుచ్చిలింగం, కృష్ణ, వీణ, సంగీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో దీపావళి

- మార్వాడీ మంచ్ ఆధ్వర్యంలో 'ఆనంద్ సబ్‌కే లియే'

బషీరాబాద్: మండల కేంద్రంలోని కేజీబీవీలో దీపావళి సంబురాలు ఘనంగా నిర్వహించారు. మార్వాడీ మంచ్ జాతీయ కార్యక్రమంలో భాగంగా సోమవారం 'ఆనంద్ సబ్‌కే లియే' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్ సర్దా మాట్లాడుతూ.. మంచ్ ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యార్థులకు లైబ్రరీ బుక్స్ అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మంచ్ సేవలను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాం రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి అభినందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రవీందర్‌రెడ్డి, ఎస్ఓ సునంద, మంచ్ అధ్యక్షుడు అనీల్ సర్దా, కార్యదర్శి సచిన్ రాటి, కోశాధికారి అరుణ్ సర్దా నాయకులు నిహార్ సోని, పవన్ సోని, దినేష్ పర్థాని, రోహిత్ అగర్వాల్, సునీల్ సర్దాడ, గుడ్డు బూబ్, రమాకాంత్ పండిట్, ఆశిష్ సర్దా, కిషన్ బూబ్, శ్రీకాంత్ సర్దా పాల్గొన్నారు.



టపాసులు కాల్చుతున్న విద్యార్థినులు

ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తాం



మోమిన్‌పేట ప్రజావాణిలో అధికారులు

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- ప్రజావాణిలో 119 అర్జీలు

అనంతగిరి: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి 119 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యతను బట్టి దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించాలన్నారు. తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు కరువు

బంట్వారం/మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. బంట్వారం, కోట్‌పల్లి కార్యాలయాల్లో అధికారులు సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించినప్పటికీ ప్రజల నుంచి స్పందన కలిపించడం లేదు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్, బంట్వారం ఎంపీఓ నాగరాజు కోరారు. మోమిన్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు కరువయ్యాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

తొమ్మిది అర్జీలు

తాండూరు: తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిలో ధరణికి సంబంధించినవి 6 అర్జీలు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ చొప్పున ఒక్కొక్క ఫిర్యాదులు అందాయి.

శ్రీనిధి రుణాలు ఇవ్వడం లేదు

పెద్దేముల్: డ్వాక్రా సంఘం సభ్యులకు శ్రీ నిధి రుణాలు ఇవ్వడం లేదంటూ సోమవారం పెద్దేముల్ ప్రజావాణిలో గ్రామానికి చెందిన దత్త సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. గతంలో తీసుకున్న శ్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించినా, ఆరు నెలలు నుంచి ఐకేపీ వీఓలు తమను పట్టించుకోవడం లేదని తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్పకు విన్నవించారు. వెంటనే శ్రీ నిధి రుణాలు ఇవ్వకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చాయని ఎంపీఓ రతన్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింగ్‌రావు, పీఓ వెంకటేశంతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతులు

బొంరాస్‌పేట: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించి పంట కాల్వలు తీయించాలని పలు గ్రామాల రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ప్రజావాణిలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. అలాగే గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈజీఎస్ పనుల్లో భాగంగా రోడ్లు, కంపచెట్ల తొలగింపు జరగాలన్నారు. బొంరాస్‌పేట నుంచి సదర్‌చెర్వు మీదుగా మద్దిమడుగు తండా రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని విన్నవించారు.

బోగస్ ఓట్లను తొలగించండి

బంట్వారం: బోగస్ ఓటర్లను జాబితాలో ఎక్కించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ గ్రామస్తులు సోమవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో విన్నవించారు. కరీంపూర్ గ్రామంతో ఎలాంటి సంబంధం లేని హైదరాబాద్‌కు చెందిన 80 మందిని ఓటర్ లిస్టులో చేర్చేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అధికారులపై కొందరు ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుందరి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బంట్వారం: అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు